క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన దుంపేట గ్రామస్తులు


వినతిపత్రం ఇస్తున్న దుంపేట గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామస్తులు సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామశివారులో ఉన్న ఎస్సారెస్పీ వరదకాలువ భూమిని గత ప్రభుత్వం రైతులు వరి, మొక్కజొన్న ధాన్యం ఆరబెట్టుకోవడానికి కేటాయించిందని, ఆ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసుకున్నారన్నారు. దుంపేట గ్రామ రైతులకు భూమి చెందేలా చూడాలని కోరారు. అనంతరం కథలాపూర్‌లో తహసీల్దార్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.

ఇసుక తరలింపును అరికట్టాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన శివారులో వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని ఆ గ్రామ మహాలక్ష్మి గుడేటి కాపు సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తీయడం వల్ల వాగు సమీపంలో ఉన్న సంఘం భవనం కూలిపోయే ప్రమాదముందన్నారు. రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

చెవులు మూసుకుని పాలకవర్గ సభ్యుల నిరసన

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ సహకార సంఘం ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు సోమవారం చెవులు మూసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ డిమాండ్లపై అధికారులు స్పందించే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ దూలూరి సుధాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయం హుండీ సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. సభ్యులు రామచంద్రం, గోపికృష్ణ, రాజశేఖర్, మల్లేశం, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, అనిల్‌రావు, ఎల్లయ్య, తిరుపతి, కొమురెలి, మల్లికార్జున్, ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

మేడిపల్లి: గ్రామాల్లో గ్రామస్తులు, విద్యార్థుల ప్రతిభను పెంచాలనే అబ్దుల్ కలాం జ్ఞాన వేదిక(గ్రంథాలయం)ను ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ వెల్మా సమత, నవీన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వల్లంపల్లిలో సోమవారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సంపతి రాజ్‌కుమార్, గౌరీ అనుప్రియ, దొడ్డి రవీనా, సందెల గణేశ్, మాజీ ఎంపీటీసీ నాయిని మమత రవి, కార్యదర్శి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇంటి వద్ద ఆందోళన

మెట్‌పల్లి: అప్పు కింద తాకట్టు పెట్టుకున్న బంగారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తున్న పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారులు కట్కం ప్రకాశ్, రమేశ్ ఇంటి వద్ద సోమవారం మరోమారు బాధితులు ఆందోళనకు దిగారు. అప్పు డబ్బులు చెల్లించడానికి తాము ముందుకు వచ్చినప్పటికీ సదరు వ్యాపారులు బంగారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారంటూ రెండు రోజుల క్రితం బాధితులు వారి ఇంటి వద్ద ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు ఇచ్చిన హామీతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కానీ సమస్య ఇంకా పరిష్కారం కాకపోవడంతో కొందరు మరోమారు ఆందోళన చేశారు. అక్కడకు పురుగుల మందు డబ్బాతో వచ్చిన ఓ మహిళ.. బంగారం ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించింది.

కట్లకుంటలో వాల్‌పోస్టర్ల కలకలం

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట ప్రధాన కూడళ్లలో వెలిసిన వాల్‌పోస్టర్లు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని గచ్చునూతి ప్రాంతంలో ఇద్దరు, గుండ్లవాడ కట్టు, గొల్లవాడ, గౌండ్లవాడ, పాల కేంద్రం, మాల, మాదిగవాడల్లో కొందరు మంత్రాలు చేస్తున్నారని, వారిని చంపుతామని, గ్రామస్తులు వారికి సహాయం చేస్తే వారికీ అదే గతి పడుతుందని హెచ్చరిస్తూ.. ప్రజలకు మంచి కోరె సంస్థ అని వాల్‌పోస్టర్లు అంటించారు.


సారంగాపూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఇబ్రహీంపట్నంలో ఆర్యవైశ్య మహిళల బతుకమ్మ వేడుకలు


మల్యాల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మెట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబరాలు

కోరుట్లరూరల్/మెట్‌పల్లి/మల్లాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల/కథలాపూర్: జిల్లాలోని పలు చోట్ల సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని కొన్ని చోట్ల దసరా తర్వాత బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చి గ్రామ కూడళ్లలో ఆడిపాడారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని కుంటలు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


కోరుట్ల మండలం సంగెంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రైతుల ఇబ్బందులు తెలుసుకోండి


మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మపురి: రైతులకు ఇబ్బంది రాకుండా మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ధర్మపురి మార్కెట్ కమిటీ పాలకవర్గంతో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా చిలుముల లావణ్య, వైస్ చైర్మన్‌గా సంగ నర్సింహులు, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ చేశారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ధర్మపురిలో సంస్కృతాంధ్ర కళాశాలను ప్రారంభించామన్నారు. విప్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కోతల పేరిట రైతులను నిలువునా దోచుకున్నారని తెలిపారు. రుణమాఫీ 80 శాతం మంది రైతులకు చేశామని, మిగిలిన వారికి త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఎస్.దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, కౌన్సిలర్లు, రైతులు తదితరులున్నారు.

చదువుతోనే సాధికారత


మాట్లాడుతున్న సీడీపీవో మమత

జగిత్యాల: బాలికలకు చదువుతోనే సాధికారత సాధించవచ్చని జగిత్యాల సీడీపీవో మమత అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాలసదనంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధికారత సాధించడానికి బాలికలు దృఢ సంకల్పంతో కృషి చేయాలని, చదువు, ఉద్యోగం విషయంలో బాలికలకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. సాధికారత సాధించాలంటే చదువు ఒక్కటే మార్గమని, బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత జిల్లా కో–ఆర్డినేటర్ అశ్విని, ఐసీపీఎస్ పీవో కరుణశ్రీ, జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి, వార్డెన్ సుందరమ్మ పాల్గొన్నారు.

భార్యను కాపురానికి పంపాలని వీరంగం

కోరుట్ల:కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన జాన వెంకటి ఇంటి ఎదుట ఆయన అల్లుడు ఆదివారం అర్ధరాత్రి దాటాక వీరంగం సృష్టించాడు. కోరుట్ల ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. వెంకటి కూతురు పుట్టింటికి వచ్చింది. దీంతో అల్లుడు నరేశ్ ఇంటికి చేరుకుని తన భార్యను పంపించాలని గొడవకు దిగాడు. కుటుంబసభ్యులందరూ ఇంట్లోకి వెళ్లిపోగా.. ఇంటిముందు ఉన్న ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టాడు. ఇంటి తలుపులకూ నిప్పు అంటించాడు. గంటన్నరపాటు గొడవ జరిగింది. పోలీసులు వచ్చి నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నరేశ్‌పై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై తెలిపారు.

ఉద్యోగం సాధించిన వారికి సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని ఫకీర్‌కొండాపూర్‌కు చెందిన ఆర్మూర్ మేఘన ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకుడు సింగని మారుతి, గ్రామస్తులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అభినయ, శ్రీనివాస్, హరీశ్‌లను కాంగ్రెస్ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ బద్దం రాధ, గ్రామస్తులు సోమవారం సన్మానించారు.

ఉపాధ్యాయుడికి..

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన పెరుమల్ల సంతోష్ ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించగా సోమవారం అంబేడ్కర్ నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గుమ్మడి సంతోష్, ఉపాధ్యక్షుడు పుర్రె జాను, యూత్ సభ్యులు రంజిత్, జీవన్, యోహన్, నవీన్, దేవదాసు, నర్సయ్య, పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కోసం బీజేపీలో చేరాలి

ధర్మపురి: అభివృద్ధి చేసిన భారతదేశ (వికసిత్ భారత్) నిర్మాణం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన వికసిత్ భారత్ కోసం బీజేపీలో చేరాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నక్కలపేటలో సోమవారం మండల అధ్యక్షుడు సంగెపు గంగారాం ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు కస్తూరి సత్యం, ఆకుల శ్రీనివాస్, వైకుంఠం తదితరులున్నారు.

క్రీడలతో మానసిక వికాసం

మల్లాపూర్: క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని మాజీ ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సాతారంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ విజేతగా వాల్గొండ టీం, రన్నరప్ కొత్తదాంరాజుపల్లి టీంకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌కు చెందిన యాచమనేని దీపక్, భూపతిపూర్‌కు చెందిన ముక్కెర నరేందర్, రామాజీపేటకు చెందిన మామిడిపల్లి లక్ష్మణ్ అనే అయ్యప్ప దీక్షాపరులు సోమవారం శబరిమలకు పాదయాత్రగా బయల్దేరారు.

శివాలయానికి పెద్ద గంట వితరణ

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో అతిపురాతన శివాలయానికి నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్పట్ల గ్రామానికి చెందిన మంచికంటి జనార్దన్–నీలిమ దంపతులు సోమవారం పెద్దగంటను వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆ దంపతులను సన్మానించి, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు చెక్కులు పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సాయంత్రం అందజేస్తారని కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉడిపి హోటల్ సీజ్


హోటల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

జగిత్యాల:జిల్లా కేంద్రంలోని గణేశ్ భవన్ ఉడిపి హోటల్‌ను ఆహారభద్రత అధికారి అనూష సీజ్ చేయించారు. ఆదివారం ఓ మహిళ ఇడ్లీ ఆర్డర్ చేసుకుని తింటుండగా అందులో జెర్రీ వచ్చింది. దీంతో ఆమె నిర్వాహకులను నిలదీశారు. మున్సిపల్ అధికారులు హోటల్‌కు చేరుకుని పరిశీలించారు. రూ.3 వేల జరిమానా విధించారు. సోమవారం హోటల్‌ను మళ్లీ తెరవడంతో అనూష మళ్లీ తనిఖీ చేపట్టారు. శుభ్రత లేకపోవడం.. ఆహార పదార్థాలు సక్రమంగా లేకపోవడంతో శాంపిల్స్ సేకరించి హోటల్‌ను సీజ్ చేశారు.

సాయిబాబా మృతికి జీవన్‌రెడ్డి సంతాపం

జగిత్యాలటౌన్: పౌరహక్కుల ఉద్యమకారుడు, మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కుటుంబానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే నెపంతో కేంద్రం ఉపా చట్టం కింద అరెస్టు చేసి పదేళ్లు జైలులో ఉంచిందని, ఆయన మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఆయన కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని కోరారు.


అందుబాటులో పోస్టాఫీసు ఖాతాలు

జగిత్యాల: ఎస్సీ విద్యార్థుల ప్రీ, పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల స్కీంల ప్రయోజనాల కోసం ఆధార్ సీడెడ్ ఖాతాలను కలిగి ఉన్న పోస్టాఫీసు బ్యాంక్ ఖాతాలు తెరిచేందుకు అందుబాటులో ఉన్నాయని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పేరుతో భారత ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ ప్రవేశపెట్టిన కొత్త బ్యాంకింగ్ సదుపాయం ఉందని, విద్యార్థులు కనీస బ్యాలెన్స్ నిర్వహణ ప్రమాణాలు లేకుండా కేవలం నామమాత్రపు చార్జీలతో సేవింగ్ ఖాతా తెరవవచ్చన్నారు.

మలేషియా అంతర్జాతీయ సదస్సుకు యువకుడు

మల్లాపూర్: జపాన్‌కు చెందిన ప్రముఖ ఎంగార్డ్ ఎనాజిక్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21 వరకు మలేషియా దేశంలో నిర్వహించే అంతర్జాతీయ బిజినెస్ సమ్మిట్‌కు మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు అడ్డిగ శ్రీనివాస్ ఎంపికయ్యాడు. డిజిటల్ టెక్నాలజీ, బిజినెస్ బిల్డింగ్ సీక్రెట్స్‌పై నిర్వహించే సదస్సులో పాల్గొనున్నాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2010–11 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాడు పాఠశాలలో చేసిన అల్లర్లను గుర్తుచేసుకుంటూ తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.


సారంగాపూర్: సారంగాపూర్ సింగిల్‌విండో కార్యాలయం, గోదాదామును కలిపి గతంలో చుట్టూ ప్రహరీ నిర్మించారు. గోడను ఆనుకుని నాటిన మొక్కలు 20 ఏళ్లలో భారీ వృక్షాలుగా మారాయి. దీంతో లోపలికి వృక్షాల వేర్లు లోపలికి వెళ్లి ప్రహరీ పగిలిపోతోంది. గోడకు ఏర్పడ్డ బీటల కారణంగా గేట్లు కూలిపోయాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వృక్షాలను తొలగించి, ప్రహరీకి మరమ్మతు చేసి, గేట్లు బిగించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లైశెట్టి శివ, సీఈవో, సారంగాపూర్ సొసైటీ సెల్ నంబర్: 6303650630

వాట్సాప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.
మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

ఏబీసీ సెంటర్‌కు కుక్కలు తరలింపు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. సోమవారం 15 వీధి కుక్కలు పట్టినట్లు తెలిపిన ఆయన, సీడీఎంఏ,కలెక్టర్ ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టామన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 15 మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం సుతారి తిరుపతిరెడ్డి బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

కోదండ రామాలయ నూతన కమిటీ ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని ఎస్సారెస్పీ కోదండ రామాలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జువ్వాడి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా జెట్టి లింగం, చెట్లపల్లి సుభేందర్, ఎర్రోల హన్మాండ్లు, యామ రాజయ్య, మాన్కల గంగాధర్, ప్రధాన కార్యదర్శులుగా బల్లు కాశీరావు, జెట్టి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా నేమూరి లక్ష్మణ్, ఇల్లెందుల శ్రీనివాస్, కోశాధికారిగా పబ్బ లింబాద్రిలను ఎన్నుకున్నారు.

టీయూఫోరం పార్లమెంట్ కన్వీనర్‌గా గంగాధర్

జగిత్యాల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా జగిత్యాలకు చెందిన గంగాధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యవర్గం

కోరుట్ల: గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా తుల రాజేందర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెన్న విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా సమీర్, సహాయ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా అబ్దుల్ ముసావీర్, కార్యవర్గసభ్యులుగా మనీషా, కటుకం రమేశ్, గురిజెల గోపి ఎన్నికయ్యారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన విధివిధానాలకు కరపత్రం ఆవిష్కరించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

పెగడపల్లి: మండలంలోని మ్యాక వెంకయ్యపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామడగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన అలువాల విష్ణు–రమ్యకృష్ణ పెగడపల్లి మండల కేంద్రంలో ఉంటూ లేడీస్ ఎంపోరియం నిర్వహిస్తున్నారు. స్వగ్రామమైన గోపాల్‌రావుపేట వెళ్లి తిరిగి పెగడపల్లికి ద్విచక్రవాహంపై వస్తున్న క్రమంలో మ్యాక వెంకయ్యపల్లి శివారులో మరో ద్విచక్రవాహదారుడు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై నుంచి వీరిరువు కింద పడటంతో విష్ణుకు కాలు, చేతి విరగగా, రమ్యకృష్ణ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. విష్ణు తండ్రి అంజయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా రమ్యకృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న యువకుల పట్టివేత

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గంజాయి సేవిస్తున్న పలువురు యువకులను అదే గ్రామానికి చెందిన కొందరు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గంజాయి సేవించడంతో పాటు గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని యువకులతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంజాయి సేవించే యువకులపై దాడి చేసినట్లు తెలిసింది. కాగా యువకులు, వారి తల్లిదండ్రులు సోమవారం గ్రామంలో తమ పిల్లలపై దాడి చేసిన వారిపై పంచాయితీ పెట్టగా వారు అక్కడికి రాకపోవడంతో వెళ్లిపోయారు. పోలీసులు గ్రామాన్ని సందర్శించి ఈ ఘటనపై ఆరా తీసినట్లు తెలిసింది.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

పెగడపల్లి: మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన బండి తిరుపతి (43) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కోసం ఎన్ని ఆస్పత్రులు తిరిగిన వ్యాధి నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన తిరుపతి సోమవారం తెల్లవారు జామున గ్రామ శివారు లోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

కోరుట్ల: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలానికి చెందిన షేక్ ముక్తార్ (23) అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది కోరుట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నానమ్మ ఇంటికి వచ్చిన ముక్తార్ తన ఆరోగ్యం ఎప్పటికీ బాగుపడదని మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి మల్లన్న ఆలయంలో దొంగతనానికి యత్నించిన దొంగను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన దొంగలుగా గుర్తించగా, పరారీలో ఉన్న దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దొంగతనాలు జరుగుతున్నందునా.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.